క్లుప్తంగా

నదుల్లో పెరిగిన నీరు



కొత్తూరు వద్ద మేజర్ శారద నదిలో నీరు

రాంబిల్లి: మేజర్, మైనర్ శారద నదుల్లో బుధవారం నీరు పెరిగింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా పడుతుండటంతో నదుల్లో నీరు చేరుతుంది. నదుల్లో నీరు పెరగడంతో పంట కాలువల్లో నీరు పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుంది. దీంతో తమకు సాగునీటి ఇబ్బందులు తప్పుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రైతులు వరినాట్లులో కలుపు తీత పనుల్లో నిమగ్నమయ్యారు. కలుపు తీత పనులు పూర్తి చేసిన రైతులు ఎరువులు , క్రిమి సంహారక మందులు పిచికారి పనులు చేస్తున్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ సంధ్య

మునగపాక : మండలంలోని తిమ్మరాజుపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం జగనన్న కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యాధికారి సంధ్య విద్యార్థులను పరీక్షించారు. 122 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా 11 మందికి కంటి సంబంధిత సమస్యలు ఉన్నట్టు గుర్తించి మందులు అందజేశారు. విద్యార్థులు కంటికి ఒత్తిడి లేకుండా చూసుకోవాలన్నారు. కాగా శిబిరాన్ని సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎంపీహెచ్‌వో సత్యనారాయణ, ఆశా కార్యకర్త భవాని పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ అభివృద్ధికి సహకరించండి



గాలియట్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): విశాఖ జిల్లా క్రీడా అభివృద్ధి అధికారిణి జె. గాలియట్‌ను ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం కలిసి సత్కరించారు. బాల్ బ్యాడ్మింటన్ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ జిల్లా చైర్మన్ ఆర్.వెంకటరావు, అధ్యక్షుడు డి.ప్రభూజీ, ప్రధాన కార్యదర్శి గొంప నర్సింహనాయుడు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

కోటవురట్ల: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని వరాహనది నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్టు అందిన సమాచారంతో బుధవారం దాడి చేశామని ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు. ఈ దాడిలో గొట్టివాడ వద్ద ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

28న దివ్యాంగుల దరఖాస్తుల పరిశీలన

యలమంచిలి : దివ్యాంగులకు ట్రైసైకిళ్ల మంజూరు కోసం దరఖాస్తుల పరిశీలన నిమిత్తం ఈ నెల 28న యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు తెలిపారు. పుట్టుకతోనే అంగవైకల్యం ఉన్న దివ్యాంగులు ట్రైసైకిళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


నేత్రపర్వంగా గణనాథుడి పూజలు



అచ్యుతాపురం మండలం ఖాజీపాలెంలో ఆకట్టుకుంటున్న గణనాథుడు



పూడిమడక గంటాలమ్మ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు



మునగపాక : ఆకట్టుకుంటున్న పల్లపువీధిలోని సింహాద్రప్పన్న అలంకరణలో వినాయకుడు



మునగపాకలో ఏర్పాటు చేసిన15 అడుగుల భారీ వినాయకుడు

అచ్యుతాపురం(అనకాపల్లి) అచ్యుతాపురం మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుని మందిరాల వద్ద మూడో రోజైన బుధవారం భక్తులు పూజలు చేశారు. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలు,సెట్టింగ్‌లు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.మండలంలోని జగన్నాథపురంలో కొలువు ఉంచిన వినాయకుడ్ని మూడు నెలల పాటు పూజలు చేసి భారీ స్థాయిలో అనుపు మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీ.

రాంబిల్లి : మండలంలో వినాయక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. పలు గ్రామాల్లో గల మండపాల్లో బుధవారం వినాయకుని సన్నిధిలో మూడో రోజు పూజలు నిర్వహించారు. పలుచోట్ల వినాయక నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా మేజర్, మైనర్ శారద నదులతో పాటు రాంబిల్లి బీచ్ ప్రదేశాల్లో భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు.

ప్రజారోగ్యానికి భరోసా జగనన్న ఆరోగ్య సురక్ష



దళితవాడలో జగనన్న ఆరోగ్య సురక్ష కరప్రత్రాలు అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఆరోగ్యానికి భరోసా ఉంటుందని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు పేర్కొన్నారు. ఈనెల 30 నుంచి మండల వ్యాప్తంగా ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం మునగపాక దళితవాడలో వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మేలు చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తోటాడను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం



గవర్ల అనకాపల్లి శ్మశాన వాటిక, రింగ్‌రోడ్డు అభివృద్ధికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

మునగపాక : గవర్ల అనకాపల్లి శ్మశాన వాటిక అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తోటాడ సర్పంచ్ భర్త దొడ్డి కోటేశ్వరరావు తెలిపారు. శ్మశానవాటికతో పాటు రింగ్ రోడ్డు ఏర్పాటుకు రూ.12 లక్షల మేర పంచాయతీ నిధులు కేటాయించడంతో బుధవారం సంబంధిత పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికలో అవసరమయ్యే మౌలిక సదుపాయాలతో పాటు రింగ్ రోడ్డు ఏర్పాటు ద్వారా వాహనదారులకు దోహదపడేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తోటాడను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ ఇస్మాయిల్, మళ్ల ఈశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము, పంచాయతీ పాలకవర్గ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉపమాకలో ఘనంగా బ్రహ్మోత్సవాలు

నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం వేకువ జామున కొండపై కల్కి అవతారంలో స్వయం వ్యక్తమై వెలసిన స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం , నిత్యార్చనలు నిర్వహించారు. అనంతరం కొండ దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి వారికి అండాళ్లమ్మవారికి స్వామివారి ఉత్సవమూర్తులకు నిత్యార్చనలు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామ బలిహరణలు పూర్తిచేసారు. అనంతరం శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వర స్వామివారిని పుణ్యకోటి వాహనంలో వేంచేయింపజేసి మాడ వీధుల్లో తిరువీధి సేవలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు పీసపాటి శేషాచార్యులు, కృష్ణమాచార్యులు, గోపాలచార్యులు, రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



మౌనికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గొలుగొండ: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చోద్యం జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుతున్న మౌనిక ఎంపికైంది. ఈనెల 19న సింహాచలంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమస్థానం రావడంతో అండర్-14 విభాగంలో మౌనిక రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు హెచ్‌ఎం రత్నాజీ, పీఈటీ కుందూరు నూకరాజు తెలిపారు. మౌనికకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆవులు

పాయకరావుపేట : కంటైనర్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న 40 ఆవులను స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. జాతీయ రహదారి గుండా విజయవాడ వైపు ప్రయాణిస్తున్న కంటైనర్‌లో 40 ఆవులను తరలించడాన్ని స్థానిక దళిత నాయకులు గుర్తించి వాహనాన్ని నిలుపుదల చేసి మార్కెట్ యార్డుకి తరలించడం జరిగిందన్నారు. పట్టుబడిన కంటైనర్‌ను స్వాధీనం చేసుకోవడం జరిగిందని, ఆవులను స్థానిక మార్కెట్ కమిటీ ఉంచడం జరిగిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆవులను గోశాలకు తరలించడం జరుగుతుందన్నారు.

పశువుల అక్రమ రవాణా అరికట్టాలి

జాతీయ రహదారి ద్వారా అక్రమంగా నిత్యం రవాణా జరుగుతున్న పశువుల రవాణాను పోలీసు శాఖ అరికట్టాలని పీసీసీ డెలిగేట్ జగతా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కంటైనర్‌లో అక్రమంగా రవాణా జరుగుతున్న 40 పశువుల్ని స్థానికులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించడం జరిగిందని విలేకరులకు తెలిపారు. పట్టుబడిన పశువులకు స్థానికంగా గోశాల ఏర్పాటుకు కూడా అనుమతి ఇవ్వాలని, వాటిని రైతులకు పంచే విధంగా కూడా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈయనతో పాటు సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు నీలాపు వెంకటరెడ్డి, కట్టా వీరబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న ఎంఈవో శివనాయుడు

మునగపాక : ఉపాధ్యాయులు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని ఎంఈవో శివనాయుడు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుదవారం సాయంత్రం ప్రదానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. అలాగే పాఠశాలల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో 3 అలాగే 4 తరగతి విద్యార్థులను సంబంధిత పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీగా నమోదు చేయాలన్నారు. ఇలా చేయడం ద్వారా అంగన్‌వాడీ టీచర్లకు ఇబ్బంది ఉండదన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ మొబైల్ రిజర్వ్ టీచర్సు కర్రి లక్ష్మి నారాయణ,, అచ్యుత కృష్ణ,నూకేష్, గోవింద, సత్తిబాబు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలి

మునగపాక : ఓటరు నమోదుపై దృష్టి సారించాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్ కోరారు. రెవెన్యూ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కొత్త ఓటరు నమోదులపై దృష్టి సారించాలన్నారు. అలాగే అర్హులైన ప్రతి ఒక్కరిచే ఫారంలు నింపించాలన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. మార్పులు, చేర్పులకు సంబంధించి సవరణలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు బీఎల్‌వోలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

మాకవరపాలెం: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22న జరిగే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని అవంతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు కోరారు. ఈ జాబ్‌మేళాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్రవారం తమ కళాశాలలో జరగనున్న జాబ్‌మేళాలో జాతీయ, అంతర్జాతీయ సంస్థలైన మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, రెడ్డీస్ లేబొరేటరీ, అరబిందో ఫార్మా వంటి 15 కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. 18-40 ఏళ్ల మధ్య వయస్సు గల, పది, ఇంటర్, ఏదైనా డిగ్రీ, డిప్లమో, ఐటీఐ బీటెక్, ఎంబీఏ పూర్తి చేసిన యువతీ యువకులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. ఇతర వివరాలకు 949190858, 9705474968, 9014765287 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

రైతులకు పాస్ పుస్తకాల పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీటీసీ భర్త రావి శోభన్‌బాబు

అచ్యుతాపురం(అనకాపల్లి): సమగ్ర భూ సర్వే ద్వారా రైతులకు మేలు జరిగేలా భూముల కొలతలు, పాసు పుస్తకాలు అందజేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు,ఎం.జగన్నాథపురం ఎంపీటీసీ భర్త శోభన్‌బాబు అన్నారు. బుధవారం అచ్యుతాపురం మండలంలోని ఉప్పవరం సచివాలయంలో సమగ్ర భూ సర్వే పూర్తి అయిన భూములకు సంబంధించి పాసు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప్పవరం సర్పంచ్ చిన్ని శ్రీనివాసరావు,మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీకి పాములవాక విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయుడు అచ్యుతరావు

కోటవురట్ల : రగ్బీలో గ్రామీణ క్రీకారులు రాష్ట్ర స్థాయికి ఎంపికై తమ సత్తా చాటుకున్నారు. జిల్లాలోని బుచ్చయ్యపేట మండలం దిబ్బిడి హైస్కూల్లో ఇటీవల జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో మండలంలోని పాములవాక ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరై ప్రతిభ చూపారు. రగ్బీ పోటీలో అండర్ 17 బాలుర విభాగంలో ఇ.హేమంత్‌కుమార్ బాలికల విభాగంలో కె.కుసుమ, పి.కిరణ్మయి విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు అచ్యుతరావు బుధవారం తలిపారు. వీరిని హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు, సర్పంచ్ సత్యవతి, కమిటీ చైర్మన్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు 950 రోజులుగా పోరాటం

అచ్యుతాపురం (అనకాపల్లి): విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ, గొర్లె ధర్మవరం, లంక ధర్మవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ 950 రోజులుగా స్టీల్‌ప్లాంట్ రక్షణకు పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాలో నిర్వహిస్తున్న బైక్ యాత్ర ఈ నెల 27న అచ్యుతాపురం చేరుకుంటుందని, దీనిలో పాల్గొని ప్రజలంతా సంఘీభావం తెలపాలని కోరారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాపూజీ, కొండబాబు, బాబు, శ్రీను పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే మృతికి సంతాపం



మాజీ ఎమ్మెల్యే మృతికి సంతాపం తెలుపుతున్న దృశ్యం

ఎస్.రాయవరం: మాజీ ఎమ్మెల్యే కాకర నూకరాజు మృతికి జగన్‌సేవాదళ్ సభ్యులు టి.అమ్మాజీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం నివాళులు అర్పించారు. చినగుమ్ములూరు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే గృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి , కాకర నూకరాజు చిత్రపటానికి పూలాభిషేకం చేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వియ్యపు వరహాలరావు, బీజేపీ నాయకుడు బత్తుల నూకయ్యశెట్టి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు జోగునాయుడు తదితరులు ఉన్నారు.

ప్రజారోగ్యానికి సీఎం జగన్ పెద్ద పీట



మాట్లాడుతున్న సర్పంచ్ సత్యనారాయణ

ఎస్.రాయవరం : గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం పట్ల అత్యంత శ్రద్ధ తీసుకుని సేవలు అందించే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అని సర్పంచ్ కర్రి సత్యనారాయణ కొనియాడారు. తిమ్మాపురం సచివాలయంలో బుధవారం సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లకు సమావేశం నిర్వహించారు. తిమ్మాపురం గ్రామ పంచాయతీలో ఉన్న రెండు సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సచివాలయం 2లో అక్టోబర్13 న, సచివాలయం 1 లో అక్టోబర్ 21 న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వియ్యపు సింహాద్రి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో మౌలిక సదుపాయాలు



కొండకర్ల శ్మశానవాటికలో భూమిపూజ చేస్తున్న మండల స్థాయి ప్రతినిధులు

అచ్యుతాపురం(అనకాపల్లి): కొండకర్ల శ్మశాన వాటికలో మౌలిక సదుపాయాల కల్పనకు బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, కె.శివ, శ్రీనివాసరావు, దుంగా రమణ, ప్రకాశ్, ధూళి నూకరాజు, కట్టమూరి పాపారావు, పచ్చకూరి నాగేశ్వరరావు, గొంతిన భాస్కర్ రావు, చొప్పా సన్యాసినాయుడు పాల్గొన్నారు.

23 వరకు సచివాలయాల్లో ఆధార్ సేవలు

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు సచివాలయాల్లోనే ఆధార్ మార్పులు చేర్పులు, కొత్త అధార్ నమోదు వంటి కార్యక్రమాలు చేసుకునేందుకు ఈ నెల 23 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు జెడ్పీ వెంకటరమణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయాల పరిధిలో ఆధార్ అప్‌డేట్ చేసుకోని వ్యక్తులు తక్షణమే చేసుకోవాలని కోరారు. సచివాలయాల్లో అందుబాటులోకి వచ్చిన ఈ ప్రత్యేక సేవల్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

ఘనంగా అక్కినేని శత జయంతి ఉత్సవాలు



అక్కినేని జయంతి సందర్భంగా పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లిటౌన్: స్థానిక చిన్నరాజుపేట సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అక్కినేని చిత్రపటానికి అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత, నటసామ్రాట్ అక్కినేని శతజయంతి వేడుకలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. నాటకాల నుంచి సినీరంగంలోకి ప్రవేశించి వందలాది చిత్రాల్లో నటించి, తెలుగు సినిమా ఖ్యాతిని పెంచారని కొనియాడారు.

అందుబాటులో తేలికపాటి వరి విత్తనాలు



వ్యవసాయాధికారి సౌజన్య

ఎస్.రాయవరం: మండలంలో వర్షాభావ పరిస్థితుల వల్ల తేలికపాటి వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు సకాలంలో కురవక పోవడం వల్ల 50 శాతం వరి నాట్లు పూర్తి కాలేదన్నారు. అయితే ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా తేలికపాటి విత్తనాలు అందుబాటులోకి ఉంచారన్నారు. ఈ విత్తనాలు ఆయా గ్రామాల్లో గల రైతు బరోసా కేంద్రాల్లో నమోదు చేసుకున్న రైతులకు 80 శాతం రాయితీతో అందజేయడం జరుగుతోందన్నారు. వరి నాటే ఉద్దేశం లేని రైతులు రాగులు, సజ్జలు ఇతర చిరుధాన్యాలు వేసుకోవచ్చని సూచించారు. అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సందర్శించవచ్చన్నారు.

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'

అనకాపల్లిటౌన్: విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అనకాపల్లి దిశ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ పి.రాములమ్మ అన్నారు. స్థానిక గవరపాలెం హిమశేఖర్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు కళాశాల ఆవరణలో బుధవారం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు ఉన్నత విలువలు, క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా మంచి మార్గంలో నడుచుకోవాలని హితవుపలికారు.

క్రీడల్లో రాణిస్తే ఉన్నత భవిష్యత్తు



మండల స్థాయి క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు

అనకాపల్లిటౌన్: విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని, జాతీయ స్థాయిలో రాణిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడవచ్చని మహాత్మా జ్యోతీరావు పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో పాఠశాలకు చెందిన 46 మంది విజేతలుగా నిలిచారు. వీరిని పాఠశాల ఆవరణలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరంతా త్వరలో జరిగే నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, వాలీబాల్, టెన్నీకాయిట్, అథ్లెటిక్స్ పోటీల్లో అండర్ 14 విభాగంలో 27 మంది, అండర్ 17 విభాగంలో 19 మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయికి ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఈ పోటీల్లో కూడా గెలుపొంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావాలని అభిలషించారు.

మోదీ పాలనతో దేశంలో గణనీయ మార్పులు

అనకాపల్లిటౌన్: దేశ ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జీవీవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్డు పోలింగ్ బూత్ నెం.201 పరిధిలో బుధవారం మోదీ జీవిత విశేషాల ఫొటో ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మోదీ తొమ్మిదేళ్ల పాలన గురించి వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో బీజేపీ పాలనలో మాత్రమే గణనీయ మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. దేశంలో అన్ని జాతీయ రహదారుల అభివృద్ధి, కొత్త పార్లమెంట్ నిర్మాణం, కరోనా విపత్తులో దేశప్రజలకు ఉచిత వ్యాక్సిన్, గరీబ్ కల్యాణ్ అన్నయోజనతో పేదలకు ఉచిత బియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చదరం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.